క్లుప్తంగా

దొంగను పట్టుకున్న పోలీసులు



వేలేరు : మండలంలోని పీచర క్రాస్‌రోడ్డు వద్ద పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు హుజూరాబాద్ మండలంలోని ఇప్పల నర్సింగాపూర్ గ్రామానికి చెందిన గోవిందుల కుమారస్వామి అనే వ్యక్తిని దొంగతనం కేసులో పట్టుకున్నట్లు ఎస్సై అజ్మీరా సురేశ్ బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మసాగర్ మండలంలోని నారాయణగిరి గ్రామానికి చెందిన పుట్ట సుదర్శన్ వేలేరు శివారులోని తన వ్యవసాయ బావి వద్ద ఆవు పాలు పితుకుతున్నాడు. అయితే నిందితుడు కుమారస్వామిని మాటల్లో పెట్టి పశువుల కొట్టంలో ఉన్న చొక్కలొంచి రూ.2500 నగదు, సెల్‌ఫోన్‌ను దొంగిలించి అక్కడి నుంచి బైక్‌పై పారిపోయినట్లు తెలిపారు. నిందితుడు ముల్కనూరు మీదుగా తన స్వగ్రామానికి బైక్‌పై వెళ్తున్న క్రమంలో పీచర క్రాస్‌రోడ్డు వద్ద పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నం చేసినట్లు తెలిపారు. దీంతో చాకచక్యంగా వ్యవహరించి పట్టుకుని విచారణ చేసినట్లు తెలిపారు. సదరు నిందితుడు నేరాన్ని ఒప్పుకున్నట్లు పేర్కొన్నారు. నిందితుడి నుంచి నగదు, సెల్‌ఫోన్, బైక్‌ను స్వాధీనం చేసుకుని కోర్టుకు పంపించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

యూనిఫాం పంపిణీ



నడికూడ : మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అంగన్‌వాడీ టీచర్ సంపూర్ణ ఆధ్వర్యంలో యూనిఫాం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పిల్లల తల్లిండ్రులు, అంగన్‌వాడీ టీచర్స్ కళావతి, వినోద, ఆయాలు నర్సమ్మ, మేరీ, సుజాత పాల్గొన్నారు.

రూబీజెస్ట్ -25 టెక్నికల్ ఫెస్ట్

కేయూ క్యాంపస్: ఈనెల 19 నుంచి 22వ తేదీ వరకు రూబీజెస్ట్ -25 టెక్నికల్ ఫెస్ట్‌ను కాకతీయ యూనివర్సిటీలోని మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈమేరకు ఫెస్ట్ పోస్టర్లను కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భిక్షాలు బుధవారం ఆవిష్కరించారు.

కేయూ రిజిస్ట్రార్‌కు సన్మానం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రంను పరిపాలన భవనంలోని చాంబర్‌లో సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మండ్ల భాస్కర్, సైకాలజీ ప్రథమ సంవత్సరం విద్యార్థులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈమేరకు ఆయనకు మొక్క అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో విద్యార్థులు రాజు, మల్లేశం, అరుణ్, విజయ్, రజిని, జుబేదా, సుచరిత, ఉమ పాల్గొన్నారు.

ఎస్సైకి అభినందన

హసన్‌పర్తి: ఇటీవల వెలువడి గ్రూప్ -1 పరీక్ష ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన కాకతీయ యూనివర్సిటీ ఎస్సై మాధవ్‌గౌడ్‌ను భీమారంలోని సత్యసాయి కాలనీలో బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో కాలనీ కమిటీ అధ్యక్షుడు తుమ్మ రామకృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడు సాంబయ్య, సభ్యులు ఉమాపతిరావు, రవీందర్, ప్రభాకర్, మహేందర్, సంపత్‌రావు, వెంకటేశ్వర్ రావు, నారాయణ రెడ్డి, దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత

మడికొండ: మడికొండలోని డంపిగ్ యార్డ్‌ను తొలగించాలని కోరుతూ ప్రజాభవన్‌లో రాష్ట్ర ప్లానింగ్ కమిటీ వైస్ చైర్మన్ చిన్నారెడ్డికి అడ్‌హక్ కమిటీ సభ్యులు మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. ఈమేరకు ఆయన ఎండర్స్ చేసి ఇచ్చిన వినతిపత్రాన్ని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్యకు కలెక్టరేట్‌లో అందజేశారు.

అడ్‌హక్ కమిటీ నియామకం

మడికొండ - రాంపూర్ మధ్య ఉన్న డంపింగ్ యార్డుతో పలు గ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు వాపోయారు. ఈమేరకు డంపింగ్ యార్డు సమస్య పరిష్కారానికి రాంపూర్ అడ్‌హక్ కమిటీని బుధవారం నియమించారు. అనంతరం వాల్ పోస్టర్లను విడుదల చేశారు.

రంజాన్‌కు ఏర్పాట్లు చేయాలి

ఖిలా వరంగల్: రంజాన్ పండుగ ఈద్ ఉల్ ఫితర్ నమాజ్‌కు ఏర్పాట్లు చేయాలని ఈద్గా అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఎంఎ.జబ్బార్ కోరారు. ఈమేరకు వరంగల్ వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ ఎండీ.రియాజ్‌ను ఫోర్ట్ రోడ్డు ఈద్గా కమిటీ ప్రతినిధులు బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం జబ్బార్ మాట్లాడుతూ ఖిలా వరంగల్ ఈద్గా మైదానంలో ఈనెల 31న జరగనున్న రంజాన్ సామూహిక ప్రార్థనలకు ఏర్పాట్లు చేయాలని కోరారు. చాంద్‌పాషా, కబ్రస్తాన్ అధ్యక్షుడు మీర్జా హసన్ అలీ, ఎండీ.ముగ్దుం, ఎండీ.సాదిక్, అంకుష్, సలీం, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

చెక్‌డ్యామ్‌లకు మరమ్మతులేవి?

- ఐదేళ్ల క్రితం భారీ వర్షాలకు దెబ్బతిన్న వైనం
- మరమ్మతులు చేపట్టని అధికారులు
- ఇబ్బందుల్లో రైతులు



అంబాలలో ధ్వంసమైన చెక్‌డ్యాం

కమలాపూర్ : భారీ వర్షాలు కురిసిన ప్రతిసారి వాగులు పొంగి పొర్లుతూ వృథాగా పోతున్న నీటికి అడ్డుకట్ట వేసేందుకు మండలంలోని పలు వాగులపై చెక్‌డ్యామ్‌లు నిర్మించారు. దీంతో తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లోనూ చెక్‌డ్యామ్‌లలో నీరు నిల్వ ఉండి భూగర్భ జలమట్టం పెరిగి మండల ప్రజలకు తాగు, సాగు నీటి ఇబ్బందులు తొలిగిపోయాయి. ఐదేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు ఆ చెక్‌డ్యామ్‌లు దెబ్బతిని కొట్టుకుపోయాయి. ప్రస్తుతం మరమ్మతులు చేసేవారులేక సాగు నీటి కోసం రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రూ.14.45 కోట్లు.. 8 చెక్‌డ్యామ్‌లు

అప్పటి హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ తెలంగాణ తొలి ఆర్థికశాఖ మంత్రిగా ఉన్న సమయంలో 2017లో మండలంలోని వాగులపై చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి రూ.14.45 కోట్ల నిధులు మంజూరు చేయగా 8 చెక్‌డ్యామ్‌లు నిర్మించారు. చెక్‌డ్యామ్‌ల నిర్మాణం పూర్తయ్యాక రెండేళ్ల పాటు నీళ్లు సమృద్ధిగా ఉండి మండలంలో పంటల సాగు గణనీయంగా పెరిగింది.

భారీ వర్షాలకు దెబ్బతిన్న చెక్‌డ్యామ్‌లు..

2020 ఆగస్టులో కురిసిన అతి భారీ వర్షాలకు వాగులు పొంగి పొర్లుతూ ఉధృతంగా ప్రవహించాయి. వాగుల ఉధృతిని తట్టుకోలేక చెక్‌డ్యామ్‌లు, వాటికి ఇరువైపులా నిర్మించిన కరకట్టలు తెగి కొట్టుకుపోయి చెక్‌డ్యామ్‌లు గండి పడ్డాయి. ఇలా మర్రిపల్లిగూడెం, నేరెళ్ల, అంబాల, గోపాల్‌పూర్ చెక్‌డ్యామ్‌లు దెబ్బతిని, తెగి గండ్లు పడి కొట్టుకు పోయాయి.

మరమ్మతులకు నోచుకోని చెక్‌డ్యామ్‌లు..

భారీ వర్షాలకు దెబ్బతిన్న చెక్‌డ్యామ్‌లకు మరమ్మతులు చేపట్టాల్సిన అధికారులు ఐదేళ్లవుతున్నా ఇప్పటి వరకు ఎలాంటి మరమ్మతులు చేపట్టలేదు. దీంతో కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన చెక్‌డ్యామ్‌లతో రైతులు, ప్రజలకు ఎలాంటి ప్రయోజనం లేకుండా నీరంతా వృథాగా పోతోంది. ప్రస్తుత పరిస్థితుల్లో తాము సాగు చేసిన పంటలకు సరిపడా నీరందక పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మరమ్మతులు చేపట్టి తమను ఆదుకొని తమ పంటలు కాపాడాలని రైతులు కోరుతున్నారు. ఉన్నతాధికారులు, పాలకులు సైతం పట్టించుకుని వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఈ సందర్భంగా రైతులు, స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మరమ్మతులు చేపట్టాలి



చెక్‌డ్యామ్‌లు నాసిరకంతో నిర్మించడంతోనే భారీ వర్షాలతో వరద ప్రవాహానికి తట్టుకోలేక అంబాల చెక్‌డ్యామ్ తునాతునకలైంది. మిగతా చోట్ల పలు చెక్‌డ్యామ్‌లు దెబ్బతిని కరకట్టలు తెగిపోయాయి. కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన చెక్‌డ్యామ్‌లను కలకాలం మన్నికగా ఉండేలా నిర్మించాల్సిన కాంట్రాక్టర్లు నాసిరకంగా నిర్మించడంతోనే ఈ దుస్థితి దాపురించింది. ఇప్పటికైనా దెబ్బతిన్న చెక్‌డ్యామ్‌లకు మరమ్మతులు చేపట్టాలి.

\- అంకతి నాగరాజు, అంబాల

ప్రయోజనం శూన్యం



కోట్లాది రూపాయలు వెచ్చించి చెక్‌డ్యామ్‌లు నిర్మించినా ప్రస్తుతం వాటితో ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. చెక్‌డ్యామ్‌ల నిర్మాణంతో వాగుల్లో నీళ్లు నిల్వ ఉండి భూగర్భ జలమట్టం పెరిగిందని, ఇక కరువులోనూ సాగు, తాగు నీటికి ఇబ్బందులు ఉండవని సంబురపడ్డాం. కానీ రెండేళ్ల వ్యవధిలోనే భారీ వర్షాలకు చెక్‌డ్యామ్‌లు దెబ్బతినడంతో ఆ సంబురమంతా ఆవిరైపోయింది. సాగు నీటికి ఇబ్బందులు పడాల్సిన దుస్థితి నెలకొంది.

\- దొంగల రాజు, నేరెళ్ల

రాజకీయ లబ్ధి కోసమే మాజీ ఎమ్మెల్యే ధర్నా

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి



మాట్లాడుతున్న బుచ్చిరెడ్డి

శాయంపేట : రాజకీయ లబ్ధి కోసమే చలివాగు పంపుహౌజ్ ఎదుట భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ధర్నా చేశారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి ఆరోపించారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి తన రాజకీయ లబ్ధి కోసమే రైతులను రెచ్చగొడుతున్నారని విమర్శించారు. బీఆర్‌ఎస్ నాయకుల మాటలు నమ్మి రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రైతుల పంటకు కాంగ్రెస్ పార్టీ రక్షణగా ఉంటుందని భరోసా కల్పించారు. భూ గర్భ జలాలు అడుగంటిన తరుణంలో చలివాగులో నీరు తగ్గిందని, రైతులకు ఇబ్బంది కలగకుండా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి నీటిని లిఫ్టింగ్ నిలిపివేయించడం జరిగిందని గుర్తుచేశారు. చలివాగు కాల్వ మరమ్మతులు జరుగుతున్న తరుణంలో క్రాప్ హాలిడే ప్రకటించినప్పటికీ రైతుల విజ్ఞప్తి మేరకు జాలువ కాల్వ ద్వారా నీటిని విడుదల చేసి చిత్తశుద్ధిని చాటుకున్నట్లు చెప్పారు. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అధికారంలో ఉన్నప్పుడు చలివాగును అడ్డుపెట్టుకుని చేపల వ్యాపారం చేశారని, ప్రాజెక్టులో 15 ఫీట్లు నీరు ఉండేలా కట్ట ఎత్తుగా పోయిస్తానని హామీ ఇచ్చి గెలిచాక విస్మరించారని గుర్తుచేశారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉండగా చలివాగులో నీటి లెవెల్స్ తగ్గిపోయినప్పుడు కాంగ్రెస్ కార్యకర్తలు, రైతులు ధర్నా చేస్తే అక్రమ కేసులు పెట్టించిన ఘనత రమణారెడ్డికే దక్కుతుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాసాని శాంతరవి, చిందం రవి, బాసాని మార్కండేయ, వలిహైదర్, వైద్యుల వెంటరాజిరెడ్డి, దుబాసి కృష్ణమూర్తి, రాజ్‌కుమార్, ఐలయ్య, డీటీ రెడ్డి, సదయ్య, నరేష్, రాజు, జగన్, రాజయ్య, రజనీకాంత్ పాల్గొన్నారు.

పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ఐనవోలు : కంప్రెషర్ కొనుగోలు విషయంలో తలెత్తిన గొడవ ఓ వ్యక్తి పురుగులమందు తాగే వరకు వచ్చింది. ఐనవోలు ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కక్కిరాలపల్లి గ్రామానికి చెందిన రాపోలు శోభన్‌బాబు (21) అదే గ్రామానికి చెందిన బోసు సాంబరాజుకు చెందిన ట్రాక్టర్ కంప్రెషర్‌ను గత ఆరు నెలల క్రితం కొనుగోలు చేశాడు. కంప్రెషర్ ప్రైవేట్ ఫైనాన్స్‌లో ఉండగా ధర చేసుకుని శోభన్‌బాబు సాంబరాజు రూ.70 వేలు చెల్లించి మిగతా డబ్బులు ఫైనాన్స్‌లో కిస్తీలుగా చెల్లిస్తున్నాడు. శోభన్‌బాబు రూ.12 వేల చొప్పున నాలుగు నెలలుగా కిస్తీలు చెల్లిస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం సాంబరాజు శోభన్ వద్దకు వచ్చి కంప్రెషర్ తనదని, తాను అమ్మలేదని బుకాయించి దుర్భాషలాడుతూ శోభన్ వద్ద నుంచి బలవంతంగా కంప్రెషర్‌ను తీసుకెళ్లాడు. దీంతో మనస్థాపం చెందిన శోభన్‌బాబు గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తాను గడ్డిమందు తాగి చనిపోతున్నట్లు సెల్ఫీ వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. శోభన్‌బాబును కుటుంబ సభ్యులు గమనించి వెంటనే వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు శోభన్‌బాబు తల్లి ఎల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం



శిక్షణ ఇస్తున్న శారద

ఆత్మకూరు : ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని శ్రీరామచంద్ర మిషన్ జిల్లా కోఆర్డినేటర్ శారద అన్నారు. మండల కేంద్రంలోని శ్రీవేణు గోపాలస్వామి ఆలయంలో శ్రీరామచంద్రమిషన్, హార్ట్‌ఫుల్‌నెస్ సెంటర్ ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభమైన ధ్యానోత్సవం (ధ్యానశిక్షణ) బుధవారం రాత్రి ముగిసింది. అభ్యాసకులకు ధ్యానంలో మెలకువలు చెప్పారు. ఈ సందర్భంగా మట్లాడుతూ.. నేటి ఆధునిక జీవనానికి ధ్యానం అవసరమన్నారు. ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని, నిత్యం ధ్యానం చేయడం అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరామచంద్ర మిషన్ మేనేజర్ వెంకటస్వామి, శిబిరం కన్వీనర్ టింగిలికారి సత్యనారాయణ, అర్చకులు ఆరుట్ల మాధవమూర్తి, ట్రైనర్ మాధవిలత, కరివేద సమ్మిరెడ్డి, పోలు రాజేశ్‌కుమార్, నాగబండి శివప్రసాద్, ఏరుకొండ రవీందర్‌గౌడ్, రూపాదేవి పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు కృషి

- పొలంబాటలో విద్యుత్ అధికారులు



వంగిపోయిన స్తంభాన్ని సరిచేస్తున్న అధికారులు

వేలేరు : రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు కృషి చేస్తామని విద్యుత్‌శాఖ హనుమకొండ డీఈఈ సామ్యానాయక్ స్పష్టం చేశారు. వ్యవసాయ బావుల వద్ద విద్యుత్ సరాఫరాలో సమస్యలు తలెత్తితే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. మండలంలోని పీచరలో పొలంబాటలో భాగంగా బుధవారం రైతుల బావుల వద్ద విద్యుత్ అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ బావుల వద్ద వంగిపోయిన స్తంభాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. బావుల వద్ద విద్యుత్ సమస్య తలెత్తితే సొంతంగా మరమ్మతులు చేయొద్దని, స్థానిక విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ రాజేశ్వరరావు, ఏఈ కుమారస్వామి, లైన్‌మెన్‌లు సుధాకర్, వెంకటేశ్వర్లు, విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..



విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఐనవోలు : మండలంలోని వెంకటపూర్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంఈఓగా అభిలాష్, హెచ్‌ఎంగా జి.ఆశ్రిత ఇతర విద్యార్థులు ఉపాధ్యాయులుగా తమ విధులను నిర్వహించారు. తరగతి గదుల్లో పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సరస్వతి మాట్లాడుతూ.. విద్యార్థులు తమ నైపుణ్యాలను ప్రదర్శించే అంశాల్లో ఇలాంటి కార్యక్రమాలు దోహదపడుతాయని అన్నారు. ఉపాధ్యాయులు వీరబ్రహ్మం, ఉషశ్రీ, జ్యోతి, రమాదేవి, రాజు తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరులో ఉపాధ్యాయులతో విద్యార్థులు

ఆత్మకూరు : మండలంలోని అక్కంపేట ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వయంపాలన దినోత్సవం ఘనంగా జరిగింది. డీఈఓగా రాకేష్, ఎంఈఓగా అశ్మిత, హెచ్‌ఎంగా విష్ణువర్ధన్ వ్యవహరించగా విద్యార్థులు ఉపాధ్యాయులగా వ్యవహరించి పాఠాలు బోధించారు. ఉపాధ్యాయులు చందు నాయక్, ఉపేందర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, సుధాకర్, ఐఈఆర్‌పీ రజిని, అరుణ, హరినాథ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ చేసేవరకు నియామకాలు నిలిపివేయాలి

- ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు
- కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు



ఐనవోలు : నిరసన దీక్ష చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



శాయంపేట : రిలే నిరాహార దీక్షలో మాట్లాడుతున్న సదయ్య



ధర్మసాగర్ : మాట్లాడుతున్న శ్రీనివాస్



ఎల్కతుర్తి : ముల్కనూరులో..

దామెర : ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ పూర్తిచేసే వరకు ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలు నిలిపివేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గోవిందు రవికుమార్ అన్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి ఎస్సీ వర్గీకరణ త్వరగా పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు రెండు మంత్రి పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు వేల్పుల రాజ్‌కుమార్, ఎమ్మార్పీఎస్ నాయకులు వేల్పుల శ్రీనివాస్, సతీశ్, శ్రీను, మహేశ్, ప్రసాద్, అనిల్, రతన్, భరత్, రాజు, భిక్షపతి, రాకేష్, ప్రశాంత్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ధర్మసాగర్ : ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నానని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో చెప్పిన మాటకు కట్టుబడి ఉండాలని ఎమ్మెస్పీ జిల్లా అధికార ప్రతినిధి గంగారపు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం 4వ రోజుకు చేరుకున్నాయి. మాదిగల ఓట్లతో జెడ్పీటీసీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ముఖ్యమంత్రిని అయ్యానని ప్రగల్భాలు పలికిన రాష్ట్ర ప్రభుత్వం.. తీర సమయానికి మాలల ఒత్తిడికి తన సీఎం పదవీని కాపాడుకునేందుకు సీఎం మాదిగలకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. అంబేడ్కర్ సంఘం రాష్ట్ర కార్యదర్శి మాదాసి అబ్రహం, బీజేపీ నాయకుడు పెరుమాండ్ల వెంకటేశ్వర్లు, సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, మద్దెల ఎల్లేశ్, కొట్టే వెంకటేశం, ఎమ్మార్పీఎస్ నాయకులు శాంతిసాగర్, ప్రశాంత్, రాజు, బాబు, శంకర్, భిక్షపతి, ప్రణయ్‌భాస్కర్, కొమురయ్య, గట్టుమల్లు, రాజిరెడ్డి, లింగం పాల్గొన్నారు.

ఎల్కతుర్తి : ఎస్సీ వర్గీకరణ అయ్యే వరకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాల నియామకం నిలిపివేయాలని కోరుతూ ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో చేపట్టిన నిరసన దీక్ష బుధవారం మూడో రోజుకు చేరుకుంది. అంబేడ్కర్ సంఘం నాయకులు సంఘీభావం తెలిపారు. ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జ్ వెంకటస్వామి, భిక్షపతి, పాపక్క, లింగయ్య, స్వామి పాల్గొన్నారు.

శాయంపేట : ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ చేయకుండా ఉద్యోగాల భర్తీ ప్రక్రియను మొదలు పెట్టి మాదిగలను సీఎం రేవంత్‌రెడ్డి మోసం చేస్తున్నారని ఎమ్మార్పీఎస్ మండల స్టీరింగ్ కమిటీ చైర్మన్ ముక్కెర ముఖేష్, మాజీ సర్పంచ్ రేణికుంట్ల సదయ్య ఆరోపించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్, ఎమ్‌ఎస్ఎఫ్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో రెండోరోజు రిలే నిరహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి హోదాలో రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా వర్గీకరణ చేస్తామని మాట ఇచ్చినట్లు గుర్తు చేశారు. నాయకులు సదయ్య, రాజేందర్, నాని, సాంబయ్య, సాంబరాజు పాల్గొన్నారు.

ఐనవోలు : సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో మాదిగలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకుడు బొక్కల నారాయణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షను ప్రారంభించి మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించి అమలు చేయాలని, ఉద్యోగ నియామకాలు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. నాయకులు ఏలియా, ఇస్లాంబాబు, చంద్రమౌళి, అనిల్, రాంబాబు, రవి, కుమారస్వామి పాల్గొన్నారు.

ఆత్మకూరు : ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సుకుమార్ అన్నారు. మండల కేంద్రంలో రిలే దీక్షలు 3వ రోజు కొనసాగాయి. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించిన అనంతరం ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు సహకరించాలి



ఆత్మకూరు : మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు అంబేడ్కర్‌వాదులంతా సహకరించాలని నిర్వాహకులు కోరారు. బుధవారం భూమి పూజ చేశారు. ఏప్రిల్14న అంబేడ్కర్ జయంతి సందర్భంగా విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంద రవి, తనుగుల సందీప్, బరుపట్ల కిరీటి, అయోధ్య, నత్తి చందర్, తనుగుల సాంబయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- ట్రైనీ ఐపీఎస్ అధికారి మనన్‌బట్



మాట్లాడుతున్న ట్రైనీ ఐపీఎస్ మనన్‌బట్

దామెర : యువత మత్తుకు బానిస కావద్దని ట్రైనీ ఐపీఎస్ అధికారి మనన్‌బట్ సూచించారు. మండలంలోని ముస్త్యాలపల్లిలో బుధవారం రాత్రి కార్డన్ సర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.17,600 విలువచేసే అక్రమ మద్యం, సరైన పత్రాలులేని 15 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ భవిష్యత్ యువతపైనే ఆధారపడి ఉందని అన్నారు. యువత మద్యానికి, మత్తుకు బానిస కాకుండా ఒక లక్ష్యాన్ని పెట్టుకుని సాధించే వరకు శ్రమించాలని పిలుపునిచ్చారు. సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అపరిచితులకు ఏటీఎం పిన్ నంబర్, ఓటీపీలు చెప్పొద్దన్నారు. ట్రాలీ ఆటోల్లో సరుకులను మాత్రమే తరలించాలన్నారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు తప్పక పాటించాలని, డ్రంకెన్‌డ్రైవ్ చేస్తే జరిమానాతో పాటు జైలు శిక్షలు తప్పవని వెల్లడించారు. సమస్యలున్నవారు పోలీస్ స్టేషన్‌కు ధైర్యంగా వచ్చి ఫిర్యాదు చేయాలని, డయల్ 100కు ఫోన్ చేయాలని సూచించారు. ఈ తనిఖీల్లో పరకాల ఏసీపీ సతీశ్‌బాబు, సీఐలు రంజిత్‌కుమార్, క్రాంతికుమార్, ఎస్సైలు కొంక అశోక్, పరమేశ్వర్, శివకృష్ణ, ప్రొబేషనరీ ఎస్సైలు, 70 మంది పోలీస్ సిబ్బందితో పాటు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

- సైబర్ క్రైమ్ డీఎస్పీ విజయ్‌కుమార్

మామునూరు: సైబర్ నేరాలపై యువత, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ డీఎస్పీ విజయ్‌కుమార్ సూచించారు. ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో సైబర్ క్రైమ్ పోలీసుల ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ప్రకాశ్ అధ్యక్షతన డిజిటల్ భద్రత, వాటి ప్రభావాలు, సైబర్ నేరాలు, రక్షణ చర్యలు, న్యాయపరమైన అంశాలపై బుధవారం అవగాహన సదస్సును నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు అనేక రకాల మోసాలకు పాల్పడుతున్నారని, ఈక్రమంలో ఫోన్‌కు వచ్చే కాల్స్, మెసేజీ, లింక్‌లకు స్పందించవద్దని సూచించారు. డిజిటల్ భద్రతపై అవగాహన పెంచుకోవాలని చెప్పారు. విద్యార్థులను సురక్షితమైన డిజిటల్ వాతావరణం వైపు మళ్లించేందుకు అధ్యాపకులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ అయేషాభాను, సత్యవతి, తన్వీర్ జహాన్, పల్లవి, మహేశ్వరి, డీన్ శశిధర్, రిటైర్డ్ ప్రొఫెసర్‌శర్మ పాల్గొన్నారు.

కుల వివక్షపై పోరాటాలకు సిద్ధం

- కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు

ఖిలా వరంగల్: శాస్త్ర, సాంకేతిక రంగం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేటి ఆధునిక యుగంలో ఇంకా కుల వివక్ష, అంటరానితనం ప్రత్యక్ష, పరోక్షంగా కొనసాగుతోందని, వాటిపై ప్రతిఘటన పోరాటాలకు ప్రజలు సిద్ధం కావాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నేతలు సీహెచ్.రంగయ్య, అరూరి కుమార్ సూచించారు. వరంగల్ ఏసీరెడ్డినగర్‌లోని రఘునాథ భవనంలో ఉసిల్ల కుమార్, ఆవుల ఉదయ్‌కుమార్ అధ్యక్షతన కేవీపీఎస్ వరంగల్ జిల్లాస్థాయి విస్తృత స్థాయి సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితులకు గుడిలో ప్రవేశంలేని గ్రామాలు, బతుకమ్మ ఆడనీయని గ్రామాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకా కుల వివక్ష, అంటరానితనం కొనసాగుతోందని వాపోయారు.